క్లుప్తంగా

నేడు వాలీబాల్ టోర్నీ

పూడూరు: అంగడిచిట్టంపల్లి గ్రామంలో వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నామని నిర్వాహకులు రైనాచంద్ తెలిపారు. సంక్రాంతి సందర్భంగా ఆదివారం ఉదయం 10 గంటలకు టోర్నీ ప్రారంభం అవుతుందని చెప్పారు. ముఖ్య అతిథిగా డీసీసీబీ చైర్మన్ బుయ్యని మనోహర్‌రెడ్డి హాజరుకానున్నారని, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ముగిసిన ధనుర్మాస పూజలు



ధనుర్మాసం పూజలో పాల్గొన్న భక్తులు

కొడంగల్: బాలాజీనగర్‌లోని పద్మావతి సమేత శ్రీ మహాలక్ష్మి వేంకటేశ్వరస్వామి ఆలయంలో డిసెంబర్ 16న ప్రారంభమైన ధనుర్మాస పూజలు శనివారంతో ముగిశాయి. ప్రతిరోజూ తితిదే తరహాలో ధనుర్మాస పూజలు చేయడం ఇక్కడి ఆచారం. ధరూర్ శ్రీనివాసాచార్యులు నిత్యం తిరుప్పావై పారాయణం పఠించి, భక్తులకు వినిపించారు. ధనుర్మాసం ముగింపుతో పాటు సంక్రాంతి పండుగ ప్రత్యేక పూజలు చేశారు. వందలాది మంది భక్తులు ఆలయానికి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

మకర విలక్కు పూజలు

కొడంగల్: మకర సంక్రాంతి సందర్భంగా పట్టణ శివారులోని బండల ఎల్లమ్మ ఆలయం సమీపంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో శనివారం మకర విలక్కు పూజలు చేశారు. స్వామివారికి మాలధారులు, భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. నైవేద్యం సమర్పించారు. మకరజ్యోతి దర్శనం నేపథ్యంలో ఆలయంలో పూజలు నిర్వహించారు.

ఘనంగా అయ్యప్ప స్వామి పూజ



అయ్యప్ప స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

అనంతగిరి: వికారాబాద్ పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయంలో శనివారం సాయంత్రం శబరిమలలో జ్యోతి దర్శనంను పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా అయ్యప్పకు అభిషేకం, అర్చనలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక హారతి ఇచ్చి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో పలువురు భక్తులు, ప్రముఖులు పాల్గొన్నారు.

వైభవంగా గోదాదేవి కల్యాణం



కల్యాణోత్సవంలో పాల్గొన్న సర్పంచ్

మొయినాబాద్‌రూరల్: మండల కేంద్రంలోని వేంకటేశ్వర స్వామి ఆలయం గోవింద నామ స్మరణతో మార్మోగింది. శనివారం ఆలయ ప్రాంగణంలో గోదాదేవి, రంగనాథ స్వామి కల్యాణ మహోత్సవాన్ని అర్చకులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కల్యాణోత్సవం సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. వారికి ఇబ్బందులు కలగకుండా ఆలయ చైర్మన్ లక్ష్మీకాంత్‌రెడ్డి, కార్య నిర్వాహకుడు బుచ్చిరెడ్డి అన్ని ఏర్పాట్లు చేయించారు.

బస్టాండున్నా.. బస్సులు రావు

- రహదారిపైనే బస్సుల నిలుపుదల
- పుష్కరకాలంగా ఇదే పరిస్థితి
- శిథిలావస్థలో ప్రయాణప్రాంగణం
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని ఆర్టీసీ



బోసిపోయిన పెద్దేముల్ బస్టాండ్ (ఇన్‌సెట్‌లో) పెచ్చులూడుతున్న పైకప్పు

పెద్దేముల్: ప్రయాణికులకు చేరువలో ఉండాలన్న లక్ష్యంతో మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన బస్‌స్టాండ్ నిరుపయోగంగా మారింది. మూడేళ్ల క్రితం రూ. లక్షలు వెచ్చించి మరమ్మతు చేయించి.. వినియోగంలోకి తెచ్చినా.. ఆ ప్రాంగణంలోకి ఒక్క ఆర్టీసీ బస్సు కూడా రావడం లేదు. రోడ్డు పక్కన సర్వీసులు నిలుపుతుండడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. బస్టాండు ఉన్నా బస్సులు లోపటికి రాకుండా.. వెళ్లిపోతుండడంతో బస్సు కోసం రోడ్లపైనే వేచి ఉండాల్సి వస్తోందని ప్రయాణికులు వాపోతున్నారు. ఇక రాత్రి వేళల్లో తాగుబోతులకు అడ్డాగా మారిందని, విషయాన్ని సంబంధిత అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి.

లక్షలు వెచ్చించినా.. వృథాయే

పుష్కరకాలం క్రితం మండల కేంద్రంలో సుమారు రూ.5 లక్షల వ్యయంతో ప్రభుత్వం బస్టాండ్ ఏర్పాటు చేసింది. నాటి రవాణ శాఖ మంత్రి, ప్రస్తుత ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి.. బస్టాండ్ అభివృద్ధికి సీసీరోడ్లు, ప్రహరి గోడకు నాడు సుమారు రూ. 15లక్షలకు పైగా నిధులు మంజూరు చేశారు. అంతా బాగుందని అనుకునేంతలో.. తీరా బస్టాండుకు బస్సులు రాకపోవడంతో.. క్రమంగా శిథిలావస్థకు చేరి, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. ఆర్టీసీ బస్సులు బస్టాండులో నిలపాలని విద్యార్థులు, స్థానికులు, ప్రయాణికులు కోరినా డ్రైవర్లు ఆపడం లేదని, ఆర్టీసీ అధికారులకు చెప్పినా పరిస్థితిలో మార్పులేదని వారు ఆరోపిస్తున్నారు.

చర్యలు తీసుకోవాలి



మండల కేంద్రంలో ఆర్టీసీ బస్టాండు ఉన్నా బస్సులు రావటం లేదు. కొన్నేళ్లుగా ఇదే పరిస్థితి. దీంతో బస్టాండు నిరుపయోగంగా మారింది. ఇప్పటికే పై కప్పు నుంచి పెచ్చులు ఊడి పడుతున్నాయి. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి బస్టాండుకు మరమ్మతు చేయించి, బస్సులు వచ్చేలా చర్యలు తీసుకోవాలి.

– శ్రీనివాస్‌రెడ్డి, ఉప సర్పంచ్, పెద్దేముల్

మూగజీవాల దప్పిక తీర్చండి



దుగ్గాపూర్‌లోని నీటితొట్టి (ఫైల్)

పెద్దేముల్: పాడైపోయిన నీటి తొట్లను బాగుచేసి, మూగ జీవాల దప్పిక తీర్చాలని రైతులు కోరుతున్నారు. గతంలో ఉపాధిహామీ, మెగావాటర్ షెడ్లు, జీపీ నిధులతో గ్రామాలల్లో నీటితొట్లు నిర్మించారు. కాని వాటి సంరక్షణ పట్టించుకోకపోవడంతో అవి బీటలు వారి శిథిలావస్థకు చేరుకున్నాయని, వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని సంబంధిత అధికారులు నీటి తొట్లకు మరమ్మతు చేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు. మండలంలోని 37జీపీల్లో 50శాతానికి పైగా నీటి తొట్లు పనిచేయటం లేదు. పశువులు, మేకలు, గొర్రెలు సుమారు 30వేలకు పైగా ఉన్నాయి. గ్రామాల్లో నీరు లేక చెరువులు, కుంటలకు వెళ్లి వాటి దప్పిక తీర్చవలసి వస్తుందని రైతులు వాపోతున్నారు. ఇదే విషయమై ఎంపీడీఓ లక్ష్మప్పను వివరణ కోరగా.. త్వరలో మరమ్మతులు చేయిస్తామని చెప్పారు.

18 నుంచి కంటి వెలుగు

మర్పల్లి: ఈ నెల 18 నుంచి నిర్వహించే కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వికారాబాద్ డీఎల్‌పీఓ అనిత అన్నారు. శనివారం పట్లూర్‌లో సర్పంచ్ ఇందిర ఆధ్వర్యంలో నిర్వహించిన కంటివెలుగు అవగాహన కార్యక్రమంలో డీఎల్‌పీఓ మాట్లాడుతూ కంటి సమస్యలు ఉన్నవారికి కంటి వెలుగు కార్యక్రమం ఉపయోగపడుతుందని చెప్పారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఇన్‌చార్జి డాక్టర్ నేహా, సర్పంచ్, వైద్య సిబ్బందితో కలిసి బ్రోచర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మహేష్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి సంతోశ, టీఆర్‌ఎస్ మండల వైస్ ప్రసిడెంట్ అశోక్ తదితరులు ఉన్నారు.

విజయవంతం చేయాలి

కుల్కచర్ల: 18 నుంచి ప్రారంభం కానున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని మండల ప్రత్యేకాధికారి హన్మంతరావు అన్నారు. ఈ మేరకు మండల పరిధిలోని ఘనపూర్, అంతారం, పుట్టపహడ్, రాంపూర్, కుస్మసముద్రం గ్రామాల్లో కంటి వెలుగు ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీఓ కరీం, అధికారులు శ్రీనివాస్, శ్రీనివాస్ రెడ్డి, ఎల్లమ్మ, కవిత తదితరులు పాల్గొన్నారు.

లోటుపాట్లు ఉండరాదు..

అనంతగిరి: కంటివెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ సత్తయ్య అన్నారు. ఈ మేరకు వికారాబాద్ మండలంలోని పలు గ్రామాల్లో ఆయన పర్యటించి, సర్పంచులు, వైద్యసిబ్బందితో సమీక్ష నిర్వహించారు. కంటి వెలుగు ఏర్పాట్లపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఎటువంటి లోటుపాట్లు ఉండరాదని, పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహించాలన్నారు.

కొత్తగా మహిళా సంఘాలు

- దివ్యాంగులు, వృద్ధుల గ్రూపుల ఏర్పాటుకు కసరత్తు
- ఓటరు జాబితా ఆధారంగా అర్హుల గుర్తింపు



మహిళా సంఘం సభ్యుల సమావేశం (ఫైల్)

దౌల్తాబాద్: కొత్తగా మహిళా సంఘాల ఏర్పాటుకు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ కసరత్తు చేస్తోంది. దివ్యాంగులు, వృద్ధుల సంఘాలను ఏర్పాటు చేయనుండగా తదనుగుణంగా క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టింది. ఓటరు జాబితా, ఇంటింటి సర్వే ఆధారంగా సంఘాల్లో లేనివారిని గుర్తించి సభ్యత్వం ఇవ్వనుంది. మహిళలు వంటింటికే పరిమితం కాకుండా ఉపాధి రంగాల్లో రాణించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం మహిళా సంఘాలను ఏర్పాటు చేసిన విషయం విధితమే. ఈ క్రమంలో మహిళలకు ఆర్థిక చేయూతనిస్తూ స్వయం ఉపాధికి ఊతమిస్తోంది. ఈ మేరకు గ్రామీణ ప్రాంత మహిళల ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది. స్వయం సహాయక సంఘాల్లో మహిళలను సభ్యులుగా చేర్పించాలని నిర్ణయించింది. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న 18 ఏళ్ల దాటిన మహిళలను గుర్తించేందుకు ఓటరు జాబితా కొలమానంగా తీసుకోనుంది.

బ్యాంకు లింకేజీ రుణాలు

మండలంలో 40 గ్రామసంఘాలు ఉండగా.. అందులో 8,435 మంది సభ్యులు ఉన్నారు. మహిళా సంఘాల్లోని సభ్యులకు బ్యాంకులు చేయూతనివ్వడంతో ఆర్థిక సాధికారత సాధిస్తున్నారు. కొత్త సంఘాల ఏర్పాటుతో గ్రామాల్లోని మహిళలందరూ సభ్యులుగా చేరనున్నారు. ఇదిలా ఉండగా.. మహిళా సంఘాలు క్రమం తప్పకుండా పొదుపు జమ చేయాల్సి ఉంటుంది. 6నెలల తర్వాత సంఘం పొదుపుతో బ్యాంకు లింకేజీ రుణాలు మంజూరు చేస్తారు. అనంతరం వాయిదా పద్ధతిలో కిస్తీలు చెల్లిస్తే.. ఏటా రుణమొత్తాన్ని పెంచుతున్నారు. రూ.5లక్షల వరకు రుణ వెసులుబాటు కల్పిస్తున్నారు. మహిళలకు బ్యాంకు రుణాలతో పాటు పావలా వడ్డీతో స్త్రీనిధి రుణాలు పొందుతున్నారు.

వివరాల సేకరణ

సంఘాల్లోని లేని సభ్యుల వాస్తవ పరిస్థితి తెలుసుకుంటున్నారు. వలస వెళ్లారా? మరణించారా? 58 ఏళ్లు పైబడిన వారా, అవివాహితులా, రెండు చోట్ల ఓటు ఉందా, మనుగడ లేని సంఘాల్లో ఉన్నారా అంటూ పలు కోణాల్లో గ్రామైక్య సంఘాల ప్రతినిధులు, వీఓఏలు, సీసీలు వివరాల సేకరణ పనిలో ఉన్నారు.

పేర్లు నమోదు చేసుకోవాలి

కొత్తగా స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేస్తున్నాం. ఏ సంఘంలో నమోదు కాని మహిళలు గ్రామంలో ఉంటే.. వీఓఏ వద్ద పేర్లు నమోదు చేసుకోవాలి. దివ్యాంగులు, వృద్ధుల సంఘాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– సాయన్న, ఏపీఎం, దౌల్తాబాద్

నాటిన మొక్కలను సంరక్షించుకోవాలి

ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి



మొక్క నాటి నీరు పోస్తున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

పరిగి: నాటిన మొక్కలను సంరక్షించుకోవాలని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి చెప్పారు. సంక్రాంతి సందర్భంగా శనివారం మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో మొక్కలు నాటి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణకోసం అడవుల శాతం పెంచేందుకు ఎంతో కృషి చేస్తుందని, అందులో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని చెప్పారు. దేశంలో ఎక్కడ లేని విధంగా గ్రామాల్లో నర్సరీలను ఏర్పాటు చేసి, హరిత గ్రామాలుగా తీర్చిదిద్దుతుందని తెలిపారు. మున్సిపల్ చైర్మన్ అశోక్‌కుమార్, ఎంపీపీ అరవింద్‌రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్, పీఏసీఎస్ చైర్మన్ శ్యాం సుందర్‌రెడ్డి, వైస్‌చైర్మన్ భాస్కర్, నాయకులు ప్రవీణ్‌రెడ్డి, కంకల్‌ప్రభాకర్, వెంకటయ్య, రవికుమార్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

క్రీడలతో సత్సంబంధాలు మెరుగు

క్రీడలతో మానసిక ఉల్లాసం పెంపొందుతుందని ఎమ్మెల్యే కొప్పుల అన్నారు. మండల పరిధిలోని బర్కత్‌పల్లి, రాపోల్ గ్రామాల్లో నిర్వహించిన క్రికెట్ టోర్నీని ప్రారంభించి మాట్లాడారు. క్రీడలు ఆడటం వలన ఎన్నో లాభాలు ఉన్నాయని, ఆటలతో ప్రాంతాల మధ్య సత్సంబంధాలు మెరుగుపడతాయన్నారు. స్పోర్ట్స్ కోటాతో ప్రభుత్వ ఉద్యోగాలు సాధించవచ్చని పేర్కొన్నారు.

మొక్కల సంరక్షణకు చర్యలు

దోమ: పల్లె ప్రకృతి వనంలో మొక్కల సంరక్షణకు చర్యలు తీసుకుంటున్నామని సర్పంచ్ లక్ష్మణ్ నాయక్ అన్నారు. గొట్లచెల్కతండాలో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనంలో నాటిన మొక్కలకు నీరు పోసి ఆయన మాట్లాడారు. పల్లె ప్రకృతి వనాల్లో రకరకాల మొక్కలను నాటి, వాటి సంరక్షణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని చెప్పారు. నిత్యం ఉపాధిహామీ సిబ్బందితో నీరు పడుతూ.. వాటి సంరక్షణకు దోహదపడుతున్నామని తెలిపారు.

జీఓ 17ను రద్దు చేయండి

ఎన్‌పీఆర్‌డీ సంస్థ జిల్లా అధ్యక్షుడు

షాద్‌నగర్: ఆసరా పెన్షన్‌ల మంజూరు కోసం ప్రభుత్వం విధించిన ఆదాయ పరిమితి జీఓ 17ను వెంటనే రద్దు చేయాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పీఆర్‌డీ) జిల్లా అధ్యక్షుడు భుజంగరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఆసరా పింఛన్ల మంజూరు కోసం ఆదాయ పరిమితిని విధిస్తూ జీఓను విడుదల చేసిందని తెలిపారు. దీంతో చాలా మంది పెన్షన్లు రద్దు అయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న దివ్యాంగుల వివాహ ప్రోత్సాహకం కోసం చాలా మంది దరఖాస్తులు చేసకున్నారని, ప్రభుత్వం వెంటనే నిదులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నందున దివ్యాంగులకు ప్రభుత్వం అందించే స్వయం ఉపాధి రుణాలు వెంటనే మంజూరు చేయాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక టీచర్లను నియమించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ఐరన్ పరిశ్రమను తొలగించండి

- లేగదూడ కళేబరంతో పరిశ్రమ ఎదుట రైతుల ధర్నా



కంపెనీ ఎదుట లేగదూడ కళేబరంతో నిరసన

కేశంపేట: స్పాంజ్ ఇస్పాత్ ఐరన్ పరిశ్రమను తొలగించాలని శనివారం రైతులు, తండావాసులు ధర్నా చేపట్టారు. ఈ ఘటన ఇప్పలపల్లి రెవెన్యూ శివారులో చోటు చేసుకుంది. బాధితుడు గ్రామస్తులు తెలిపిన ప్రకారం.. పొలాల మధ్య ఉన్న ఐరెన్ పరిశ్రమ నుంచి వెలువడుతున్న కాలుష్యంతో పంటలు నాశనమవుతున్నాయని వాపోయారు. రాత్రివేళ కాలుష్యకారకాలను వదులుతుండడంతో పంటలు విషతుల్యమవుతున్నాయన్నారు. తూర్పు గడ్డతండా పంచాయతీ పరిధిలోని దేవునిగుడి తండాకు చెందిన కెట్రావత్ పోట్రం పాడిపరిశ్రమపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాడు. ఆయనకు చెందిన ఓ లేగదూడ చనిపోవడంతో లేగ దూడ కళేబరాన్ని పరిశ్రమ ఎదుట ఉంచి తండావాసులు, రైతులతో కలిసి ధర్నా చేపట్టారు. కంపెనీ వెదజల్లుతున్న కాలుష్యం వల్లే తమ లేగదూడ మృత్యువాత పడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పరిశ్రమను పొలాల మధ్య నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ధర్నా చేస్తున్న సమయంలో పరిశ్రమ నిర్వాహకులు అసభ్య పదజాలంతో దూషించారని వాపోయారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

పాలమూరు చారిటబుల్ ట్రస్టు చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి



ప్రొటీన్ బాక్స్‌లు పంపిణీ చేస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి దంపతులు

షాద్‌నగర్‌రూరల్: పౌష్టికాహారం తీసుకుంటేనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని పాలమూరు చారిటబుల్ ట్రస్టు చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. సంక్రాంతి సందర్భంగా ట్రస్టు ఆధ్వర్యంలో నమో మాతృమూర్తి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా శనివారం గర్భిణులు, బాలింతలకు ఒక్కొక్కరికి నాలుగు ప్రొటీన్ బాక్స్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. సేవ చేయాలనే లక్ష్యంతో ట్రస్టు ఆధ్వర్యంలో బాలింతలకు, గర్భిణులకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమాన్ని నియోజకవర్గంలో ఏడాదిపాటు కొనసాగిస్తామని తెలిపారు. పౌష్టిక ఆహారం తీసుకుంటే పుట్టబోయే బిడ్డలు ఆరోగ్యంగా ఎదుగుతారని చెప్పారు. బాలింతలకు కావాల్సిన ప్రొటీన్లు, విటమిన్లు లభిస్తాయని వెల్లడించారు. సంపాదించిన దానిలో కొంత మొత్తాన్ని సమాజాభివృద్ధికి, పేదల సంక్షేమానికి ఖర్చు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు విజయ్ భాస్కర్, మోహన్‌సింగ్, నర్సింహా, మురళి, ఆకుల ప్రదీప్, వంశీ, రుషి, నరేందర్, గణేశ్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలపై మక్కువ పెంచుకోవాలి

- చదువుతో పాటు ఆటల్లో రాణించాలి
- డీసీసీబీ చైర్మన్ మనోహర్ రెడ్డి



దోమ: యువతకు క్రీడా కిట్లను అందజేస్తున్న డీసీసీబీ చైర్మన్ మనోహర్ రెడ్డి

దోమ: యువత క్రీడలపై మక్కువ పెంచుకోవాలని, చదువుతోపాటు ఆటల్లో రాణించాలని డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి అన్నారు. శనివారం బుదాపూర్, బొంపల్లి గ్రామాల్లో నిర్వహించిన క్రికెట్ టోర్నీలో ఆయన పాల్గొని.. యువతకు రూ.25 వేల ఆర్థిక సహాయం అందజేసి మాట్లాడారు. క్రీడల వలన శారీరక దృఢత్వం పెంపొందుతుందని, ప్రతి ఒక్కరూ ఆటలపై దృష్టి సారించేందుకు శ్రద్ధ చూపాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పాండు, ఉపసర్పంచ్ తుల్జా, జిల్లా గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ యాదయ్య గౌడ్, బీఆర్‌ఎస్ నేతలు పవన్ యాదవ్, ప్రవీణ్ యాదవ్, లోకేశ్ యాదవ్, రాజేశ్‌యాదవ్, ఖలీం, రియాజ్, ఖదీర్, శ్రీనివాస్, అంజనేయులు, శివకుమార్, కిమ్యానాయక్, మోత్యానాయక్, చందర్, తుల్జా, విజయ్, ఆయా గ్రామాల యువత, తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు: ఎస్‌ఐ

మర్పల్లి: చదువుతో పాటు ప్రతి విద్యార్థి క్రీడల్లో రాణించాలని ఎస్‌ఐ అరుణ్‌కుమార్‌గౌడ్ అన్నారు. సంక్రాంతి సందర్భంగా జాజుగుబ్బడి తాండాలో బీఆర్‌ఎస్ పార్టీ మండల యూత్ ప్రెసిడెంట్ మధుకర్ వారం రోజులుగా క్రికెట్ టోర్నీ నిర్వహించారు. ఈ పోటీలో 32 జట్లు పాల్గొన్నాయి. చివరిరోజు శనివారం జాజుగుబ్బడి తండా, మర్పల్లి గ్రామానికి చెందిన క్రీడా కారులు ఫైనల్‌గా ఆడారు. ఈ పోటీలో మర్పల్లి టీం రన్నర్‌గా నిలిచారు. ఈ క్రీడల ముగింపు కార్యక్రమానికి ఎస్‌ఐ పాల్గొని మాట్లాడారు. ప్రతి విద్యార్థి చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. అనంతరం విజేత జట్టుకు రూ.25 వేలు, రన్నర్ జట్టుకు రూ.12 వేల 500, అందజేశారు. కార్యక్రమంలో బూచన్‌పల్లి సర్పంచ్ జయదయాకర్, ఉప సర్పంచ్ నర్సింహ్మారెడ్డి, టోర్నీ నిర్వాహకులు పండరినాథ్, కిషన్, ప్రభు, రాంజీ, గోపాల్, సుభాష్, రాజుతో పాటు క్రీడాకారులు తదితరులు ఉన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

కుల్కచర్ల: క్రీడలు మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయని డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్ రెడ్డి అన్నారు. బండవెల్కిచర్ల గ్రామ పరిధిలో జిల్లా స్థాయి వాలీబాల్, క్రికెట్ టోర్నీని ప్రారంభించి మాట్లాడారు. ఆటలు ఆడడం వలన శారీరకంగా దృఢత్వాన్ని కలిగి ఉండటంతో పాటు మానసికంగా ఉల్లాసాన్ని పొందుతారని చెప్పారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆంజనేయులు, సర్పంచ్ శిరీష, ఎంపీటీసీ హబీబ్ అహ్మద్, ఉప సర్పంచ్ రాములు, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ చంద్రారెడ్డి, బ్లాకు అధ్యక్షుడు భరత్ కుమార్, నాయకులు శ్రీనివాస్, అంజిలయ్య, జలీల్, గోపాల్ నాయక్, పీటీసీ ఖాజ తదితరులు పాల్గొన్నారు.

ఊరూరా సంక్రాంతి

సంక్రాంతి సంబురాల్లో భాగంగా శనివారం పల్లెలు, పట్టణాల్లో ముగ్గులు, క్రీడా పోటీలు ఘనంగా నిర్వహించారు. రంగవల్లుల పోటీల్లో యువతులు, మహిళలు, చిన్నారులు పాల్గొని సింగిడిని తలపించే రంగవల్లులతో ఆకట్టుకోగా.. క్రికెట్, కబడ్డీ క్రీడాపోటీల్లో యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీల అనంతరం విజేతలకు నిర్వాహకులు బహుమతులు ప్రదానం చేయగా.. చిన్నాపెద్దా గాలిపటాలు ఎగురవేస్తూ.. సందడి చేశారు.

– సాక్షి, నెట్‌వర్క్



పూడూరు: విజేతలకు బహుమతులు అందజేస్తున్న బీజేపీ నాయకులు



బొంరాస్‌పేటలో..



దోమ: బహుమతులు ప్రదానం చేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు



కుల్కచర్ల: ముగ్గుల పోటీలో మొదటి బహుమతి అందజేస్తున్న నేతలు



పూడూరు: కబడ్డీ జట్టుకు బహుమతులు అందజేస్తున్న నాయకులు



ధారూరు: నాగారంలో ముగ్గులు వేస్తున్న మహిళలు, యువతులు